

యం.వి. కిషన్

వినిపించని సంగీతం

గంజాయి వనంలో తులసి మొక్కలా

మాలతి ఆ ఇంట తప్పబుట్టిందన్న అభిప్రాయానికి రావడానికి ముందు, శ్రీహరిరావు ఆ ఇంట్లోని మనుషుల్నీ ఆ ఇంటి పరిస్థితుల్నీ నిశితంగా పరిశీలించి అవగాహన చేసుకున్నాడు. తన అవగాహన లోప భూయిష్టమైనది కాదని నిర్ధారణ చేసుకున్నాకనే ఆ అభిప్రాయాని కొచ్చాడు

ఎవరి విషయంలోనూ, ఎలాంటి విషయంలోనూ తొందరపడి ఒక అభిప్రాయానికి రాకూడదన్నది శ్రీహరిరావు ముఖ్య సిద్ధాంతాల్లో ఒకటి. అందుకే తన మనసుకి అవగతం కాని ప్రతిదాన్నీ అతను డీప్‌గా స్టడీ చేస్తుంటాడు. స్టడీ చేసి, అర్థంచేసుకోడానికి ప్రయత్నిస్తుంటాడు.

కుటుంబరావుగారి కుటుంబాన్ని స్టడీ

చేసి అతగాడు అర్థంచేసుకున్న దేమిటంటే -

కుటుంబరావుగారు: విషవృక్షం. తన విషప్రభావంతో పెళ్ళాం అనబడే కల్పతరువుని మాడ్చి మసిచేసి, పిల్లలనబడే పచ్చని మొక్కల్ని కూడా అదే గతి (అధోగతి) పట్టించడానికి నిర్విరామంగా కృషిచేస్తున్న అప్రాచ్యుడు! తోకలేని పశువు!!

కుటుంబరావు గారి సంతానం (మాలతి మినహా) ; విషవృక్షం నీడను పెరుగుతూ, విషాన్ని పీలుస్తూ, భవితవ్యంలో విషవృక్షాలు కాగల విషపు మొలకలు!

మాలతి : గంజాయివనంలో తులసి మొక్క- విషవృక్షం నీడనే పెరుగుతున్న అమృతపు మొలక! తండ్రిలోవి, తోబుట్టువుల్లోని విషాన్ని హరింపజేయాలని అనుక్షణం వ్యర్థప్రయత్నం చేస్తూ.... కరిగిపోతున్న కొవ్వొత్తి!!!

* * *

పక్కింట్లోంచి సన్నగా ఏడుపు వినరావడంతో చేతిలోని కలాన్ని పక్కన పెట్టి, చెవులు రిక్కించాడు శ్రీహరిరావు.

ఫట్! ఫట్!! - ఎవరో.... ఎవరో్ని కొడుతున్న చప్పుడు!

ఎవరో ఏమిటి? ఎవరో ఏమిటి?.... ఆ అప్రాచ్యుడే! మాలతినే కొడుతుండాలి.... అనుమానం అనవసరం! దుర్మార్గుడు.... తుచ్ఛుడు.... నీచుడు!!

అసహ్యంతో ఒళ్ళు జలదరించిపోయింది శ్రీహరిరావుకి.

"నాన్నా, కొట్టకు నాన్నా.... చచ్చిపోతున్నాను కొట్టకు నాన్నా!"— ఏడుపు.

మాలతిదే? ఏడ్వటానికే పుట్టిన మాలతిదే ఆ ఏడుపు!

వెళ్ళి కుటుంబరావుగారి పీక పిసికేయా లన్నంత కోపం వచ్చింది శ్రీహరిరావుకి. ఐనా తమాయించుకున్నాడు - తనకు మాలిన విషయాల్లో తల దూర్చటం తగని పనని.

"ఛస్తే చావ్వే.... నువ్వొక్కదానివే కాదు, మీరంతా కట్టుగట్టుకొని ఏకంగా ఒక్కసారే చావండి... అప్పుడుగాని నా ప్రాణం కుదుటపడదు...." గర్జన. ఆ వెనుక - మళ్ళీ కొడుతున్న చప్పుడు!

వాళ్ళు కాదురా చావాల్సింది. నువ్వు. ఔను నువ్వేరా! చెదపురుగులా వాళ్ళ జీవితాల్ని తినేస్తున్నావు. వాళ్ళు చస్తే నీ ప్రాణం కుదుటపడ్తుందో లేదోగానొరేయ్ ... నువ్వు ఛస్తే వాళ్ళ జీవితాలు తప్పకుండా బాగుపడ్తాయ్. చావరా! త్వరగా చావు! కసిగా పళ్ళు కొరికాడు శ్రీహరిరావు.

"ఆ పనేదో నువ్వే చేసి, ఆ పుణ్యమేదో నువ్వే మూటగట్టుకో నాన్నా!" వెక్కిళ్ళ మధ్య మాలతి స్వరం.

వెంటనే — మనిషి గొడ్డును కొడు

తున్నట్టూ, గొడ్డు మనిషిని కుమ్ము తున్నట్టూ అలజడి!

అది వినలేక అక్కడ్నించి లేచి పోయాడు శ్రీహరిరావు.

* * *

పీచురేగిన జుట్టు.... చిరిగిపోయిన దుస్తులు.... వడిలిపోయిన సుందర కుసుమంలాంటి వదనం.... ఒళ్ళంతా సున్నపు పట్టీలతో.... గాలివానలో చిక్కుకుపోయిన గూడులేని పక్షిలా... రూపమెత్తిన దైన్యంలా .... తన కళ్ళెదుట నించున్న మాలతిని చూడగానే ఎవరో కడుపులో చెయ్యి పెట్టి దేవి నట్టనిపించింది శ్రీహరిరావుకి

"కూర్చో మాలతీ!" అన్నాడు కుర్చీ చూపెడుతూ.

కళ్ళ నిండుగా కన్నీళ్ళు నింపుకుంటూ కుర్చీలో కూలబడింది మాలతి.

శ్రీహరిరావు కళ్ళల్లోని జాలి, మాలతి కళ్ళల్లోని కన్నీరు - ఒకదా న్నొకటి పరామర్శించుకుంటున్నాయి.

అతని కళ్ళల్లోని జాలి తన హృద యాన్ని కొరికేస్తున్నట్టనిపించి, రెండు చేతుల్లో మొహం దాచుకొని గావురు మంది మాలతి.

తనివితీరా ఆమె ఏడుస్తుంటే- హృదయభారం తగ్గనైనా తగ్గుతుంది కదాని ఆమెను ఓదార్చే ప్రయత్నం చేయలేదు శ్రీహరిరావు. ఆమె ఏడు స్తుంటే అలా చూస్తుండిపోయాడు.

ఏడ్చి ఏడ్చి, ఒకింతసేపటికి తెప్ప రిల్లింది మాలతి, "శ్రీహరిగారూ!" పిలిచింది.

"ఏమిటి మాలతీ?" దయార్ద్ర స్వరంతో బదులుపలికేడు శ్రీహరిరావు.

"నాకో చిన్న సాయం చేసిపెడ తారా?"

"అదేమిటి మాలతీ!! నువ్వేదైనా అడిగితే నేనెప్పుడైనా కాదన్నానా?"

"కాదన లేదనుకోండి.... కాని అవన్నీ వేరు, ఇప్పుడు నేను అడగ బోయేది వేరు."

"అంటే? అంత అడగరానిదా?.... ఫర్వాలేదు.... అడుగు."

"నాకు.... నాకు కొంచెం విషం తెచ్చిపెట్టండి...."

"మాలతీ!" కదిలిపోయాడు శ్రీహరి రావు. చటుక్కున కుర్చీలోంచి లేచి ఒక్కుదుటున మాలతిని సమీపించాడు. "ఏమైంది నీకీ వేళ? నరకయాతనల్ని నవ్వుతూ స్వీకరించటం నీ కలవాటేగా? ఎందుకింత బేలగా మాట్లాడుతున్నావు?"

"శ్రీహరిగారూ!" ఏడ్చేసింది మాలతి. "ఈ రోజు మా నాన్న నన్ను కొట్టింది దేనికో తెలుసా శ్రీహరిగారూ? తాగటానికి డబ్బు లియ్యలేదని కాదు.... బ్రాకెట్టాడ్డానికి మదుపు పెట్టలేదని కాదు...."

"జాలిగా చూస్తున్నాడు శ్రీహరిరావు.

"వసంత.... వసంత... "

"ఊఁ.... వసంత ?"

చెబుదామా వద్దా అని సంశయించింది మాలతి.

"ఊఁ.... చెప్పు మాలతీ !"

చెప్పేసింది - "వసంత కాలు జారింది."

"ఏమిటి మాలతీ! ఏమిటన్నువ్వంటున్నది!!"

"ఔను, శ్రీహరిగారూ! దానికి నెల తప్పింది. అది కాలు జారింది, దానికి నెల తప్పింది. అందులో ఆశ్చర్యమేమీ లేదు. కాని.... ఈ విచిత్రం విన్నారా?"

"ఏవిఁటది ?"

"దానికి నెల తప్పించింది నేనుట !"

"మాలతీ ??"

"ఔను శ్రీహరిగారూ .... దాన్ని కళ్ళల్లో పెట్టి కాపాడుకోవలసిన బాధ్యత నాదట! నేను అలక్ష్యం చెయ్యబట్టి దానికి నెల తప్పిందట!" చెప్పి, కుళ్ళి కుళ్ళి ఏడ్చింది మాలతి.

ఏమనాలో పాలుపోలేదు శ్రీహరి రావుకి. ఆమె నెలా ఓదార్చాలో తోచ లేదు.

* * *

మాలతీ!

ఎన్నో రోజులుగా నా మనసులో దోబూచులాడుతున్న ఊహను ఈవేళ నీ ముందుంచాలనిపించింది. ఉంచుతున్నాను. దీన్ని నీ పట్ల జాలితో నేను చేసుకున్న తొందరపాటు నిర్ణయంగా నువ్వెంత

మాత్రం పరిగణించవద్దు. ఎన్నాళ్ళగానో నా మనసులో గూడుకట్టుకొని వున్న కోరికకు రూపకల్పనే ఈ ఉత్తరం.

నేనూ ఇక్కడికి వచ్చినప్పట్నుంచీ మీ కుటుంబ పరిస్థితులన్నీ నిశితంగా పరిశీలిస్తూ, ఒక్కొక్కర్నే కీన్‌గా అబ్జర్వ్ చేస్తున్నాను.

నా అబ్జర్వేషన్‌లో నే నర్థం చేసుకున్న దేమిటంటే - ఉజ్వలమైన భవిష్యత్తుకోసం ఇంతో అంతో కృషిచేస్తూ, కళ్ళల్లో వొత్తులు పెట్టుకొని ఎదురు చూస్తున్నది మీ ఇంట్లో నీవు ఒక్కదానివి మాత్రమే. మి:తా ఏ ఒక్కరిలోనూ ఆ ఆలోచనా లేదు, ఆ ఆశాలేదు. వాళ్ళంతా ఎవరిమట్టుకు వాళ్ళు బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తూంటే, నీ వొక్కదానివీ అందరి బాధ్యతలూ నెత్తిన వేసుకొని మీ కుటుంబాన్ని చక్కదిద్దాలని వ్యర్థప్రయత్నం చేస్తున్నావు. కానీ, నీ తాపత్రయానికి గుర్తింపులేదు సరికదా....నీ మంచితనాన్ని ప్రతిఒక్కరూ వంచిస్తున్నారు. వాళ్ళు తప్పటడుగులు వేస్తూ వాటి ఫలితాలను నీ నెత్తిన రుద్దుతున్నారు. ఇలా ఎంతకాలం? నువ్వు సహిస్తూ వచ్చినంతకాలం ఇలా సాగుతూండాల్సిందేగాని నువ్వు ఎదురు చూస్తున్న రేపు మాత్రం రానేరాదు. నీ జీవితంలో నవ్వులు పండనే పండవు.

త్రాగుడు, బ్రాకెట్ .... అవి రెండే జీవితానికి పరమార్థాలుగా పరిగణిస్తున్న మీ నాన్న తండ్రిగా మీకు ఒరగబెడుతున్నదేమిటి? పిల్లల భవిష్యత్తుకి బంగారుబాటలు నిర్మించవలసినవాడై ఆ పని చేయడంలేదు సరికదా, తన బిడ్డల భవిష్యత్తుకి అడ్డంగా ముళ్ళకంచెలు కడుతున్నాడు. ఉన్న పొలం కాస్తా అమ్మేశాడా? ఇక రేపో మాపో ఇల్లు కూడా అమ్మేయడని గ్యారంటీ ఏమిటి? అది కూడా పోతే - ఇంటిమీద అద్దె రూపేణా వస్తున్న ఆ కాస్త రాబడీ లేకుండా పోతే - మీ కుటుంబానికి వేరే ఆధారమేముంది? మిషను కుట్టి నువ్వు సంపాదించే దేపాటి? అప్పుడు మీ పరిస్థితి ఏమిటి?

మీ అన్నయ్య ఉన్నాడంటే చెట్టల్లే ఎదిగాడేగాని అతనివల్ల కూడా ప్రయోజన మేమీలేదు. జులాయి తిరుగుళ్ళూ, నాటకాలూ - అవే అతడి లోకం. బాధ్యతాయుతంగా అత నీ జన్మ కి ప్రవర్తిస్తాడని నేననుకోను. కాదంటావా?

పోతే మీ చెల్లెలుందంటే .... మీ ఇంటి పరిస్థితంతా తెలిసుండి కూడా ఇలాంటి పని చేసిందంటే - మీ కుటుంబం బాగును కాదుకదా, కనీసం తన బాగును తానైనా కోరుకునే మనిషిలా తోచటం లేదు.

ఇక మీ తమ్ముడు .... ఇప్పుడంటే పసివాడు కాని, రేపొద్దున్న ఏ గూటి చిలక ఆ పలుకే పలుకునన్నట్టు....మీ అన్నా నాన్నలను ఆదర్శంగా తీసుకుం

టాడే గాని, తద్భిన్నంగా ప్రవర్తిస్తా డనుకోవడం వెర్రితనమే అవుతుంది.

ఇదంతా నే నెందుకు రాస్తున్నానంటే నువ్వు ఎంత అవివేకంగా ఎలాంటి వ్యక్తులకోసం పాటుపడుతున్నావో నీకు గుర్తుచేయడానికి. నీ కళ్ళు తెరిపించ డానికి.

మాలతీ! నీ వాళ్ళెవరూ వాళ్ళు బాగు పడనూ పడరు; నిన్ను బాగుపడానివ్వరు.

వా ళ్ళ కో స ం నువ్వు తాపత్రయ పడటం దేనికి ?

పగలంతా రెక్కలు ముక్కలు చేసుకొని మిషను కుట్టి సంపాదించిన దంతా సాయంత్రమయేసరికి మీ నాన్నకి - ఆయనచేత దెబ్బలు తిని .... ధార పొయ్యడం దేనికి?

మీ అన్న, మీ చెల్లి, మీ తమ్ముడు వాళ్ళు రాటుదేలినమనుషులు. వాళ్ళ నేమీ అనలేక మీ నాన్న అన్నిటికీ నీమీద ధ్వజమెత్తుతుంటే నువ్వెందుకు సహిం చాలి? సహించలేక ఏ విషమో మింగి చావాలన్నంత నిరాశకి ఎందుకు లోనుకావాలి ?

ఆలోచించు. బాగా ఆలోచించు.

విషం కావాలని అడిగావు నువ్వు. అయితే....నేను నువ్వు 'ఊఁ' అంటే చాలు నీ జీవితంలో అమృతం చిలికించ డానికి సిద్ధంగా ఉన్నాను. మీ కుటుంబంతో సంబంధ బాంధవ్యాలన్నీ తెంచేసుకుంటే నేను నిన్ను వివాహం చేసుకుంటాను. నిన్ను ఆ నరకంనుంచి తప్పిస్తాను. ఏమంటావ్ ?

బాగా ఆలోచించుకొని ఏ విషయమూ తెలియజెయ్.

నువ్వు కాదనవని ఆశిస్తూ
శ్రీహరిరావు.

- రాయటం ముగించి, రాసినదాన్నో మారు చదువుకుని, మడిచి జేబులో పెట్టుకొని, మాలతి కిచ్చొద్దామని బయటి కెళ్ళాడు శ్రీహరిరావు. అయితే బయట ఏదో గొడవ జరుగుతూండటం గమ నించి గుమ్మంలోనే నించుండిపోయాడు.

కుటుంబరావుగారి యింటి ముందు— చేతుల్లో బెల్టులతో....హిప్పీ జుట్లు.... బెల్‌బాటమ్ పాంట్లు....ఓ నలుగురు ఆకు రౌడీలు చింపొని తలా ఓ అరుపూ అరుస్తున్నారు.

"ఒరేయ్, బయటికి రారా! నీ అంతు చూస్తాం!"

"పూటకి ఠికాణా లేని వెధవ్వి నీ మొహానికూడా లవ్వట్రా ?!"

"మా చెల్లికి లౌలెటర్ రాయడానికి నీ కెన్ని గుండెల్రా ? - రాస్కెల్!"

"ఆడముండలా ఇంట్లో దాక్కున్నా వేంరా ? రారా బయటికి"

"ఒరేయ్ రారా!"

"ఒరే ఖోజ్జా రారా బయటికి...."

ఆకాశా న్నంటుతున్నాయ్ అరుపులు.

"ఒరేయ్! మీ అరుపులకు భయపడి పోవడానికి ఇక్కడెవరూ గాజులు

తొడుక్కొని లేరురా. ఇదిగో వచ్చాను. ఏంచేస్తారో చెయ్యండి," అంటూ రాకెట్‌లా ఇంట్లోంచి బయటికి దూసుకొచ్చాడు గోపీ. మగతనాన్ని సవాలు చేస్తే రోషపడని మగవా డెవడుంటాడు?

అంతే! రెప్పపాటులో బెల్టులు నాలుగూ ఛెళ్ ఛెళ్ మంటూ గోపీ ఒంటిమీద నాట్యం ప్రారంభించాయి.

అజ్ఞాస్తున్న శ్రీహరిరావుకి అరికాళ్ళలోంచి నడినెత్తివరకూ వొణుకు పుట్టుకొచ్చింది. చిన్నప్పట్నుంచి పోట్లాట అంటే అతనికి తగని భయం! ఇంట్లోకి వెళ్ళిపోవడానికి సిద్ధపడ్డాడు. అయితే అంతలో ఏడ్చుకుంటూ పరుగెత్తుకొచ్చింది మాలతి.... "శ్రీహరిగారు వాళ్ళు మా అన్నయ్యను చంపేస్తున్నారు....వద్దని చెప్పండి... వదిలిపెట్టమని చెప్పండి...." ఏడుస్తూ శ్రీహరిరావు కాళ్ళను వాటేసుకొంది.

కాలూ చెయ్యీ అడలేదు శ్రీహరిరావుకి ఔనని కాని, కాదని కాని అనలేకపోయాడు. శిలా విగ్రహంలా నించుండిపోయాడు.

అవతల బెల్టుల నాట్యం వేగం పెరిగింది. "అమ్మోయ్! నాయనోయ్!" అని కేకలేస్తూ బాధతో మెలికలు తిరిగిపోతున్నాడు గోపీ. చుట్టూతా పోగైన జనం చోద్యం చూస్తూ నించున్నారేగాని, ఏ ఒక్కరూ ఆ ఘోరాన్ని ఆపు జెయ్యటానికి ప్రయత్నించటంలేదు. ఆకు రౌడీలు విజృంభించారు.

శ్రీహరిరావుతో ఇక లాభంలేదనుకొని తానే అందుకు సిద్ధపడింది మాలతి. గుంపులోకి జొరబడిపోయింది. "అన్నయ్యా వచ్చేయ్‌రా...తప్పించుకొని వచ్చేయ్‌రా," గోపీ నుద్దేశించిఅరుస్తోంది. "ఏమండీ మా అన్నయ్య నొదిలిపెట్టండి. మీకు దణ్ణం పెడతాను....కనికరించండి" రౌడీల నుద్దేశించి చేతులు జోడించి ప్రాధేయపడుతోంది.

"ఒరేయ్ లుచ్చా! నీ కీ సన్మానం చాలదురా....ఉండు నిన్నేం చేస్తానో" అంటూ, ఇంటిముందున్న పందిరికప్పులోంచి లావాటి కర్ర నొకదాన్ని ఊడబెరికి చేతబట్టుకున్నాడు రౌడీల్లోని ఒకడు. "మీ రాగండి, వాడి భరతం నేను పడతాను" అంటూ బెల్టుదారుల్నందర్నీ పక్కకి లాగాడు.

"అన్నయ్యా!" అంటూ భయవిహ్వలయై అరిచింది మాలతి.

సరిగ్గా అదే క్షణంలో అక్కడికొచ్చాడు కుటుంబరావు. పక్కవాడో రెండు ముక్కలు చెప్పగా పరిస్థితి అర్థం చేసుకొని, "ఆగండి!" అంటూ వెర్రి కేకేశాడు.

తాటాకు చప్పుళ్ళకి కుందేళ్ళు బెదురుతాయా? ఆగలేదా రౌడీ. అతని చేతిలోని కర్ర గాల్లోకి లేచింది. వెనువెంటనే వెనుదిరిగింది.

మరో క్షణంలో అది గోపీని తాకేదే కాని, "నాయనా గోపీ" అనరుస్తూన్న అదే



క్షణానికి కుటుంబరావు అడ్డమెళ్ళటం వల్ల - గోపీని బదులు కుటుంబరావు బుర్రను తాకింది. తాను రెండై, అతని బుర్రను రెండుగా చీల్చింది.

చివ్వున రక్తం ఎగజిమ్మింది!

జనంలో కలకలం చెలరేగింది!!

* * *

క్షణాల్లో హాస్పిటల్‌కి చేర్చబడ్డ కుటుంబరావు అక్కడ కొద్దిగంటలసేపు చావు బ్రతుకులమధ్య ఊగిసలాడి, కొసకి చావును కౌగిలించుకున్నాడు. చనిపోయే ముందు - పిల్లల్ని దగ్గరికి తీసుకొని, "నేను మీకు అన్యాయం చేసిపోతున్నాను. ఇక మీదట మీ రెలా బ్రతుకుతారో ఏమో!" అని ఏడుస్తూ, పిల్లల గురించి అతను వ్యక్తంచేసిన ఆవేదన....తపన శ్రీహరిరావుని దిగ్భ్రాంతుణ్ణి చేశాయి.

తన అవగాహన కందని కొత్త విషయాన్ని గ్రహించి సిగ్గుపడ్డాడు శ్రీహరిరావు. సిగ్గుపడి, "మీ పిల్లల గురించి మీరేం విచారించకండి కుటుంబరావు గారూ? ఇక నుంచి వాళ్ళకు అండగా నే నుంటాను. వాళ్ళ బాగోగులన్నీ నేను చూస్తాను. నన్ను నమ్మండి" అంటూ పోతున్న ప్రాణాన్ని ఓదార్చి పంపాడు.

కుటుంబరావుని కాటి కప్పగించి ఇంటికొచ్చిన శ్రీహరిరావుని చూసి ఘొల్లుమంది మాలతి.

"చూశారా శ్రీహరిగారూ? మానాన్న మా కెంత అన్యాయం చేసిపోయాడో చూశారా? మమ్మల్నెలా దిక్కులేని వాళ్ళని చేసి వెళ్ళిపోయాడో చూశారా? ఇంక మా కెవరండీ దిక్కు?" అని ఆమె ఏడుస్తుంటే, దగ్గరగా వెళ్ళి ఆమె శిరసున చెయ్యానించాడు శ్రీహరిరావు.

"ఊరుకో, మాలతీ! ఊరుకో....ఎంత

ఏడ్చేం ప్రయోజనం? ఏడిస్తే పోయిన వాళ్ళు తిరిగొస్తారా? మీ నాన్నగారు పోవడం....నిజంగా మీ పాలిటి పూడ్చ లేని వెలితే! కాని....మీరు దిక్కులేని వాళ్ళైపోయారని మాత్రం అనుకోవద్దు నేనున్నాను. ఊరుకో .... ధైర్యంగా వుండు"

"ఎంత కాలం శ్రీహరిగారూ! ఎంత కాలం మీరు మాకు దిక్కుగా వుండ గలరు? మీరు.... మీ రేమైనా మా నాన్న కాగలరా?"

మాలతి అలా అడుగుతుంటే శ్రీహరిరావు కళ్ళు చెమర్చాయి.

"ఔను.. మాలతీ! నేనే కాదు, ఈ లోకంలో ఇంకెవ్వరూ మీకు మీ నాన్న కాలేరు. కానీ మాలతీ.... నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నువ్వు ఊ అంటే నిన్ను నా దాన్ని చేసుకుంటాను. సంతోషంగా మీ అందరి బాధ్యతా స్వీకరిస్తాను.... ఏమంటావ్ మాలతీ? కాదనవు కదూ!" ఆమె చుట్టూ చేతు లల్లుతూ ఆప్యాయంగా, ఆత్రంగా ప్రశ్నించాడు.

సున్నితంగా అతని చేతుల్ని తప్పించి అన్నది మాలతి: "నాకు.... నాకు కొంత వ్యవధి కావాలి"

"అలాగే, మాలతీ! తొందరేం లేదు. బాగా ఆలోచించే నీ నిర్ణయం తెలియజెయ్" అన్నాడు శ్రీహరిరావు.

ఆ మర్నాడు శ్రీహరిరావు చేతిలో ఓ కవరుంచింది మాలతి.

"ఏమిటిది, మాలతీ?" అనడిగాడు శ్రీహరిరావు

"చదవండి.... తెలుస్తుంది" అంటూ వెళ్ళిపోయింది మాలతి - శ్రీహరిరావు కేకేస్తున్నా వినిపించుకోకుండా.

కవరు తెరిచి, ఉత్తరం చదివాడు శ్రీహరిరావు -

'శ్రీహరిరావు గారికి,

ఎంతో ఔదార్యంతో నన్ను మీ భార్యగా స్వీకరిస్తాననీ, మా కుటుంబానికి అండగా నిలబడతాననీ అన్నారు మీరు. ఎంత విశాలహృదయులో అర్థమయింది నాకు.

మీరు నన్ను నిజంగానే ప్రేమిస్తు న్నారో లేక మా కుటుంబ పరిస్థితులకు జాలిపడి ఆ నిర్ణయాని కొచ్చారో నాకు తెలియదు గాని, నేను మాత్రం మీ ఔదార్యాన్ని ఉపయోగించుకోలేకపోతు న్నాను. నన్ను మన్నించండి.

మీరు నాకు ప్రసాదిస్తున్న అమూల్య వరాన్ని కాదని కాలదన్ను తున్నందుకు నాపై కోపగించుకోకండి. దయతో నన్ను అర్థంచేసుకోవడానికి ప్రయత్నించండి.

వంసత విషయం మీకు తెలుసు కదా! సవరించుకోవడానికి వీలులేని తప్పిదం చేసింది తను. అతనికి పెళ్లై పోయిందట. కాబట్టి దాని జీవితం బాగుపడే అవకాశం ఇంక లేనట్టే.

దాన్నలా మోడులా మిగిల్చి నా సౌఖ్యం, నా స్వార్థం నేను చూసుకోవడానికి నా మనసు సుతరామూ అంగీకరించటం లేదు. ఏం చెయ్యను చెప్పండి?

శ్రీహరిగారూ!

ఎంతో ఉన్నతమైన భావాలు, ఆశయాలు వ్యక్తంచేస్తూ ఎన్నెన్నో కథలు రాస్తుంటారు మీరు. ఆ ఔన్నత్యం కేవలం మీ కథలవరకే పరిమితం కాకుండా మీలోనూ వున్నదని దృఢంగా నమ్ముతున్నాను నేను. ఆ నమ్మకంతోనే మిమ్మల్నో కోరరాని కోరిక కోరాలనుకుంటున్నాను. చెప్పమంటారా?

మీరు నన్ను ప్రేమించిన మాట నిజమే అయితే - అందుకు కారణం నా రూపమే అయుండాలి. అవునా? అయితే వసంత నాకన్నా అందంగా వుంటుంది. అది వేసిన ఆ ఒక్క తప్పటడుగు వినా మిగతా అన్నిట్లోనూ అది నా కన్నా మిన్నే! తెలిసీ తెలియక అజ్ఞానంతో అది చేసిన ఒక్క తప్పిదం దాని విండు జీవితాన్ని బుగ్గిపాలు చేస్తున్నది. మీరు సహృదయులు. మహోన్నతమైన వ్యక్తిత్వం గలవారు, నన్ను కాక, మా వసంతను స్వీకరించి చీకటికి ఆహుతైపోతున్న దాని జీవితాన్ని కాంతిమయం చెయ్యగలరేమో ఒక్కసారి ఆలోచించండి.

ఇలాంటి కోరిక కోరుతున్నందుకు నన్ను మరోమారు మన్నించండి.

మాలతి.

చదవడం ముగించి, వెంటనే మరోసారి చదివాడు శ్రీహరిరావు. ఆ వెనుక మరోసారి.... మరోసారి.... మరోసారి లెక్కలేనన్ని సార్లు చదివాడు.

కానీ, అలా ఎన్నిసార్లు చదివినప్పటికీ మాలతి త్యాగం వెనుక వున్నదేమిటో అతనికి అర్థంకాలేదు. బహుశా ఇంకెన్ని సార్లు చదివినా కూడా అర్థం కాదేమో! ఎందుకంటే....

అతడు చిన్నప్పుడే తలిదండ్రులను కోల్పోయి, తోబుట్టువుల్లేని కారణంగా ఏకాకిగా పెరిగి పెద్దవాడైన వ్యక్తి.